# పద్మావతి యుక్తి

శ్రీమతి పుల్లగంటి సరస్వతీదేవిగారు

★

గోలకొండ పట్టణమున సుబ్బారాయుశెట్టి అనువర్తకుడుగలడు. ఇతను చాలా ధనవంతుడు. యితనికి పద్మావతియను భార్యగలదు. వీరికి చాలా రోజులవరకు పిల్లలు కలుగలేదు. పద్మావతి అనేక నోములు నోచినది. అనేక వ్రతములు చేసినది. కన్యకా పరమేశ్వరి దయవలన వీరికి పుష్పావతి అను కుమార్తె కలిగినది.

ఈ బాలిక పూర్ణచంద్రునిబోలి దినదిన ప్రవర్ధమానయై పెరుగుచుండెను. కుమార్తెకు యుక్తవయస్సు రాగానె తగినవరునిచూచి వివాహము అతివైభవముగా జరిపెను.

ఈ వివాహమునకు అనేక రకముల మేళములు ఆటగుఱ్ఱములు తెప్పించెను. ఆట గుఱ్ఱములలో దాదాసాహెబు ఆటగుఱ్ఱమనిన చాలా ప్రసిద్ధి. ఈ వర్తకుడు ధనవంతుడు అగుటచే ఆ గుఱ్ఱమునుకూడా తెప్పించెను. ఆట గుఱ్ఱములతో మేళములతో కుమార్తె వివాహము అతివైభముగా జరిపెను.

ఊరేగింపుఅయి యింటికి వచ్చిన తరువాత హఠాత్తుగా దాదాసాహెబు గుఱ్ఱము మరణించెను. గుఱ్ఱము చనిపోయినది కావున నా గుఱ్ఱము నాకు యివ్వవలసినది అని సాహెబు వర్తకుని అడిగెను. చనిపోయిన గుఱ్ఱం రాదు. గనుక గుఱ్ఱము ఖరీదుగాని వేర గుఱ్ఱముగాని యిచ్చెదనని చెప్పెను. దాదాసాహెబు వినలేదు.

పెండ్లివారు పెండ్లికివచ్చిన పెద్దలు ఎంత చెప్పినా సాహెబు మూర్ఖముగా మా తాత, నాయన కాలంనుంచి వచ్చిన గుఱ్ఱం. ఆ గుఱ్ఱమే నాకు కావాలి. డబ్బువద్దు; ఏమివద్దు. అని పోట్లాడుచుండెను.

పద్మావతి చాలా తెలివైనది. ఆమె తలుపు దగ్గరవుండి అన్నియు వినుచుండెను. భర్తను యీ యిక్కట్టునుండీ తప్పించుటకు ఒక వుపాయము తోచినది.

భార్య భర్తలకు కష్టసుఖములలో పాలుండును. కావున ఒకరి వుపాయమువలన యిరువురికి సంతోషము కలుగును.

ఒకమారు లోనికి రమ్మని భర్తను పిలచెను. వర్తకుడు లోనికిపోయెను. ఆమె తలుపు వోరగా వుంచి అదివరకే దొడ్డిలోని ఓటితొట్టితెచ్చి పెట్టుకొనెను. భర్త లోనికి రాగానే పద్మావతి తలుపు దగ్గరకువేసి తొట్టి తలుపుకు అనించిపెట్టి వుంచెను.

కొంతసేపటికి సాహెబు వర్తకుని పిలచెను. రాలేదు. ఎంతసేపు పిలచినా రానందున కోపము వచ్చి తలుపును గట్టిగా తన్నెను. తలుపుకు ఆనుకొనివున్న తొట్టి భళ్ళున బ్రద్దలై ముక్కలు ముక్కలై పోయెను.

వర్తకుడు లబలబ మొత్తుకొనుచూ బయటికివచ్చి నా తొట్టి పగిలిపోయినది; నా తొట్టి నాకు యివ్వవలసినది — అని సాహెబును అడిగెను. పగిలిపోయినతొట్టి రాదు గనుక తొట్టి ఖరీదు ఎంతో అంత కాని క్రొత్త తొట్టిగాని యిచ్చెదను అనెను.

మా తాతలనాటినుంచి వుంచినతొట్టి. మాకు అచ్చివచ్చినది. అదే కావాలి. డబ్బువద్దు. ఏమివద్దు. అని తగవులాడుచుండెను. సాహెబు తన మూర్ఖత్వమునకు ప్రాయశ్చిత్తము అని తెలిసికొని నా చనిపోయిన ఆటగుఱ్ఱమునకు మీ పగిలిపోయిన తొట్టికి చెల్లు అని వెడలిపోయెను.

పద్మావతియొక్క విజ్ఞానమువలన ఆటగుఱ్ఱం, ఓటితొట్టి సమానము అయినది.

విజ్ఞానవంతులైన యువతీమణుల సంసారములు ఆనందముగా యుండును.